RNI NO: APTEL/25/A0108
www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS
Epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
మహి న్యూస్
ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
-: సంప్రదించండి :-
9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 164 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజిలు : 8 | వెల రూ. 2 | సోమవారం -14 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool l Anatapuram l Chittoor l East & West Godavari l Guntur l Krishna l Nellore l Srikakulam l Visakhapatnam l Vijayanagaram l Prakasham & Hyderabad & Telangana



## సౌదీ అరేబియాకు షాక్.. ఎర్ర సముద్ర మార్గానికీ హౌతీల ముప్పు

- ఎర్ర సముద్ర తీరంలో వేగంగా బలపడుతున్న హౌతీ రెబల్స్
- కీలకమైన మోఖా పోర్టు, పెరిమ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న హౌతీలు
- డ్రోన్ దాడులతో సౌదీ తూర్పు-పశ్చిమ పైప్‌లైన్ మూసివేత
- సౌదీ చమురు ఎగుమతులపై తీవ్ర ప్రభావం, తగ్గిన సరఫరా
- అంతర్జాతీయంగా 100 డాలర్లు దాటిన ముడిచమురు ధరలు

## భారత పౌరసత్వంపై గ్రోక్ సమాధానం.. ఎలాన్ మస్క్ వైరల్ కామెంట్



- భారత్‌లో స్థిరపడాలనుకున్న ఐర్లాండ్ వ్యక్తికి గ్రోక్ ఏఐ సమాధానం
- పౌరసత్వానికి 12 ఏళ్ల నివాసం తప్పనిసరి అని వెల్లడి
- ఈ సంభాషణపై 'ఇండియా ఈజ్ రియలిస్టిక్' అని స్పందించిన ఎలాన్ మస్క్



## ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా?

- స్కిల్ కేసులో క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం
- ఏడు దశల్లో వెరిఫికేషన్ అంటే ఇదేనా చంద్రబాబూ?
- దీనిని ఏ విధంగా న్యాయమైనది, పారదర్శకమైనది అని అనగలం?
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు



- డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై జగన్ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్
- రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానిస్తున్నారని విమర్శ
- బాక్సర్ పెద్ద అప్పలరాజు నేషనల్ ఛాంపియన్ అని వెల్లడి
- ఆధారంగా సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన లోకేశ్

# పంచ సూత్రాల రాజధానిగా అమరావతి

## వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కేంద్రం

- ★ అమరావతిలో క్వాంటమ్ బయో వ్యాలీ
- ★ జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- ★ ఆరోగ్య, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ కోసం ఎన్డీయే
- ★ 'ఎక్స్'లో నడ్డాకు సీఎం కృతజ్ఞతలు



అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చింది. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుంది. పంచ సూత్రాల రాజధానిగా అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. నో పోల్ సిటీగా.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో స్మార్ట్ వర్క్ చేసి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నాం. మిగతా 2 లో



## వైసీపీలో కీలక మార్పులు.. పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించిన జగన్

- వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తల పదవుల్లో మార్పులు
- వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డిలకు కీలక బాధ్యతలు
- రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా బీరక సురేంద్రబాబు
- డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా పోరాట కమిటీ ఏర్పాటు
- న్యాయ పోరాటం కోసం ప్రత్యేకంగా లీగల్ సెల్ నియామకం

అమరావతి: వైసీపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి

# 14న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

## శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబు

- మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించనుంది
- నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు
- ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం మిగతా 2 లో

# కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్ల ఏర్పాటు

## బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తాం: సీఎం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా దశలవారీగా చెల్లిస్తా




హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో సమావేశమై బీసీలకు సంబంధించిన పలు సమస్యలను సీఎంకు వివరించి వినతిపత్రం మిగతా 2 లో

# అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు భోను సిద్ధంగా ఉంది

## 22ఏ ఉమ్మడి రాష్ట్రం నుంచే అమల్లో ఉంది.. కొత్తగా పెట్టింది కాదు

- ధరణి పేరుతో భూముల దోపిడీ
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగుచూసిన ఆధారాలు
- మేం నిషేధిత జాబితాలో ఒక్క ఎకరానూ కొత్తగా చేర్చలేదు
- ఇళ్లు నిర్మించుకుని దీర్ఘకాలికంగా ఉంటున్న వారిపై త్వరలో విధాన నిర్ణయం
- శాసనసభలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



హైదరాబాద్: 'ధరణి పోర్టల్ పేరుతో గత పాలకులు ప్రభుత్వ భూముల దోపిడీకి పాల్పడ్డారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్ది సమయంపాటు తొలగించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారు. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే దోపిడీకి సంబంధించి మిగతా 2 లో



## నందిగ్రామ్‌లో పోటీ చేయండి.. మా అభ్యర్థి ఉండరు మమతకు రెబల్స్ ఆఫర్

- నందిగ్రామ్ ఉపఎన్నికలో మమతపై పోటీకి దూరంగా ఉంటామన్న టీఎంసీ రెబల్స్
- ఆమె పోటీ చేస్తే తమ అభ్యర్థిని నిలబెట్టబోమని స్పష్టం చేసిన తిరుగుబాటు వర్గం
- మమత కూడా అసెంబ్లీలో ఉండాలని కోరుకుంటున్నామన్న విపక్ష నేత శీతబ్రత బెనర్జీ
- సువేందు అధికారి రాజీనామాతో నందిగ్రామ్‌కు ఉపఎన్నిక

## 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు



- అసెంబ్లీ సాక్షిగా పొంగులేటి అబద్ధాలు
- మా మామపై మాట్లాడింది కూడా అసత్యాలే
- నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చిన భూమినే మా మామ కొన్నారు
- పొంగులేటి భూబాగోతాన్ని బయటపెడుతున్నందుకే నాపై, నా కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

## బాల్యమిత్రుడికి ప్రధాని మోదీ అభయం.. కదిలిన యంత్రాంగం



ఢిల్లీ : తన 37 ఏళ్ల క్రితం నాటి భూవివాదాన్ని పరిష్కరించాలని అస్గర్ అలీ వోహ్రా (81) తన బాల్య మిత్రుడు ప్రధాని మోదీని కోరారు. అందుకు ప్రధాని మోదీ అభయమిచ్చారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. గుజరాత్‌లోని వద్‌నగర్‌లో ప్రధాని మోదీతో కలిసి చదువుకున్న 81 ఏళ్ల అస్గర్ అలీ వోహ్రా తన భూ వివాదంపై జోక్యం చేసుకోవాలని ప్రధానిని అభ్యర్థించారు. మహారాష్ట్రలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ భూ వివాదంపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఆయన కోరారు. మహారాష్ట్రలోని మీరా రోడ్ ప్రాంతానికి చెందిన అస్గర్ అలీ వోహ్రా (81) ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నేరుగా కలిశారు. 1989లో ముంబై భాయందర్ ఈస్ట్ పరిధిలోని నవ్‌ఘర్ ప్రాంతంలో సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని తాను రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే 2011లో 'స్వయం బిల్డర్స్', స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు చెందిన 'సెవెన్ ఎలెవన్ కన్ స్ట్రక్షన్' సంస్థలు తన భూమిని కబ్జా చేశాయని వోహ్రా ఆరోపించారు. అసలు యజమానికి తెలియకుండా నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని రెండు భాగాలుగా విభజించి ఆ రెండు సంస్థల పేరిట ఆక్రమించుకున్నారని ఆయన వాపోయారు. ఈ భూ వివాదానికి సంబంధించి 2015లోనే ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ, కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. దశాబ్దాలుగా రెవెన్యూ శాఖ, మున్సిపల్ అధికారులు, పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగకపోవడంతో చివరికి ఆయన ప్రధాని మోదీని ఆశ్రయించారు. తన గోడు వెళ్లబోసుకున్న వోహ్రాకు ప్రధాని సానుకూలంగా స్పందించి అభయమిచ్చారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్నాయక్ విడుదల చేయగా, ప్రధాని తన బాల్య స్నేహితుడికి తగిన న్యాయం అందేలా చూస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాని కార్యాలయ జోక్యంతో కదిలిన మున్సిపల్ యంత్రాంగం ఈ ఉదంతంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 16న ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక విచారణకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా 'సెవెన్ ఎలెవన్ కన్ స్ట్రక్షన్', 'స్వయం బిల్డర్స్' ప్రతినిధులకు అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు.

## ఢిల్లీలో అగ్ని ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం




ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఢిల్లీలోని వాయువ్య ప్రాంతమైన స్వరూప్ నగర్‌లో ఆదివారం ఉదయం ఒక గోడౌన్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు దాదాపు 15 అగ్నిమాపక యంత్రాలను ఘటనా స్థలానికి రప్పించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. ప్రాథమిక నివేదికల ప్రకారం, భయాందోళనల మధ్య కొందరు స్థానికులు భవనాల పైనుంచి దూకడం వల్ల మరికొందరికి గాయాలైనట్లు సమాచారం. మంటలు చెలగడానికి అసలు కారణం ఏమిటి అనే కోణంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది విచారణ జరుపుతున్నారు.

## కొత్త కమిషనర్‌గా కేతరిన్ శరణ్య బాధ్యతలు



తమిళనాడు: వేలూరు కార్పొరేషన్‌ను హరిత నగరంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేతరిన్ శరణ్య అన్నారు. వేలూరు కమిషనర్‌గా పనిచేస్తున్న సుల్తానాను చెన్నైకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అదే స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్న కేతరిన్ శరణ్యను నియమించారు. దీంతో శనివారం ఉదయం ఆమె వేలూరులో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేలూరు కార్పొరేషన్‌లోని సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు అధిక ప్రాదాన్యత ఇస్తామన్నారు. అదే విధంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కాగా కమిషనర్ కేతరీన్ శరణ్య వేలూరు ఎస్పీ శివరామన్ సతీమణి కావడం గమనార్హం.

## రాహుల్, ప్రియాంకతో మలేసియా ప్రధాని భేటీ



న్యూఢిల్లీ: 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కోసం భారత్‌కు వచ్చిన మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆదివారం లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. దీనిలో రాహుల్ సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. ముగ్గురూ కలిసి అల్పాహారం స్వీకరిస్తూ, పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు. అన్వర్ ఇబ్రహీం రాహుల్ గాంధీని కలిసిన సమయంలో ఇరువురు పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అనంతరం అల్పాహార టేబుల్ వద్దకు వెళ్లారు. అక్కడ ప్రియాంకా గాంధీ వాద్రా కూడా ఉండటంతో ముగ్గురూ కలిసి అల్పాహారం చేస్తూ మాట్లాడుకున్నారు. అయితే చర్చించిన అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికాలేదు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. రక్షణ, వాణిజ్యం, డిజిటల్ సాంకేతికత, సెమీకండక్టర్లు తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఇరువురు చర్చించారు. ఫిబ్రవరి 2026లో మోదీ మలేసియా పర్యటన సందర్భంగా వచ్చిన ఫలితాలపైనా చర్చ జరిగినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ-భద్రత, సెమీకండక్టర్లు, మౌలిక వసతులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, ఫిన్‌టెక్, విద్య, పర్యాటకం తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకార పురోగతిని నేతలు సమీక్షించారు.

# చైనా రూటే సెపరేటు

**జాబిల్లిపైకి చాంగీ--7 ప్రయోగం త్వరలో**

**నీటి రూపురేఖలు, వాడకాలపై పరిశోధనలు**

**రష్యాతో కలిసి రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి ప్రణాళికలు**



జాబిల్లి దక్షిణ ధ్రువం వద్ద నీళ్లున్నాయని తెలుసు. కానీ ఏ రూపంలో? ఎంత మోతాదులో? మనం వాడుకోగలమా? ఆసక్తికరమైన ఈ ప్రశ్నలన్నింటికీ త్వరలోనే సమాధానాలు తెలియనున్నాయి. అంతా చైనా ప్రయోగిస్తున్న ఛాంగీ--7 యాత్ర ఫలితం. ఒక పక్క నాసా తన ఆర్టిమిస్--3 ప్రోగ్రామ్ ద్వారా జాబిల్లిపై శాశ్వత మానవ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నిస్తూంటే.. ఇంకోవైపున చైనా వినూత్నమైన రీతిలో జాబిల్లిపై తన ముద్ర వేసేందుకు కృషి చేస్తూండటం విశేషం. జాబిల్లిపై నీరున్న విషయం తెలిసి ఇప్పటికి 20 ఏళ్లు అవుతోంది. తెలియనిదల్లా అది ఏ రూపంలో ఉంది? వంటి వివరాలు మాత్రమే. ఎందుకంటే కొన్ని వందల కోట్ల సంవత్సరాలుగా సూర్యరశ్మి సోకని అంటే వెలుగు అస్సలు లేని ప్రాంతంలో నీటి ఉనికిని శాస్త్రవేత్తలు గుర్తించారు. అక్కడి ఉష్ణోగ్రతలు --200 డిగ్రీ సెల్సియస్ వరకూ ఉంటాయని అంచనా. అంతటి శీతల పరిస్థితుల్లో నీరు ఏ రూపంలో ఉందో? మనం దాన్ని ఎలా వాడకానికి అనువుగా మార్చుకోవాలో ఇప్పటివరకూ తెలియదు. ఈ లోపాలన్నింటినీ సరిదిద్దేందుకు చైనా ప్రయత్నిస్తోంది. వచ్చే నెలలో జరిగే చాంగీ--7 ప్రయోగం ఈ దిశగా వేస్తున్న తొలి అడుగు. జాబిల్లిపైకి ఇటీవలే జరిగిన ఒక ప్రయోగం విఫలమైనప్పటికీ చైనా సరికొత్త ఇంజిన్‌తో తాజా ప్రయత్నం చేస్తోంది.

### చాంగీ--7 లక్ష్యాలేమిటి?

ఇప్పటివరకూ జాబిల్లి దక్షిణ ధ్రువం పైకి జరిగిన అంతరిక్ష ప్రయోగాల కంటే చాంగీ--7 భిన్నమైంది. ఎందుకంటే ఇందులో ఒక ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌తోపాటు ఒక హాపర్ కూడా ఉంటాయి. 2024 మార్చిలోనే ప్రయోగించి ప్రస్తుతం కక్ష్యలో ఉన్న క్యూకియా--2 రిలే శాటిలైట్ కూడా చాంగీ--7 ప్రయోగానికి ఎంతో ఉపయోగపడనుంది. చాంగీ--7 కచ్చితంగా ఎక్కడ ల్యాండ్ అవుతుందన్నది ఇప్పటికైతే తెలియదు కానీ.. ఆర్టిమిస్--3 ద్వారా నాసా ఏర్పాటు చేయాలని అనుకుంటున్న కేంద్రం కోసం ఎంపిక చేసిన షాకిల్‌టన్ క్రేటర్‌కు సమీపంలోనే సూర్యరశ్మి తాకే చోట ఉండవచ్చునని అంచనా. ఈ మొత్తం ప్రయోగంలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది 'హాపర్'గురించి. ఇది చక్రాలున్న రోవర్ లాంటిది కాదు. అక్కడి నేలలో గుంతల్లాంటివి కానీ, నెర్రెలు కానీ ఉంటే వాటిని దాటేందుకు ఎగరగల సామర్థ్యం ఉన్నది. సాధారణ వాహనాలు ప్రయాణించలేని లోతులకు కూడా ఇది వెళ్లగలదు. ఆర్టిమిస్--3 ద్వారా నాసా కూడా జాబిల్లిపైని నీటిని, వనరులను గుర్తించి వాడుకునేందుకు చైనా కంటే భిన్నమైన మార్గంలో ప్రయత్నిస్తోంది. చాంగీ--7 చైనా ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు కాగా... నైసా వాణిజ్యస్థాయిలో ప్రైవేట్ సంస్థల ద్వారా లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తోంది. చాంగీ--7 జాబిల్లి దక్షిణ ధ్రువం వద్ద ఉపయోగించదగ్గ వనరులు ఏమేం ఉన్నాయి? అన్నదానిపై కూడా దృష్టి పెట్టనుంది. రెండేళ్ల తరువాత అంటే 2028లో జరిగే చాంగీ--8 ద్వారా ఈ వనరులను వాడుకోవడం ఎలా? అన్నదాన్ని పరిశీలించాలన్నది చైనా ఆలోచన. తరువాతి దశలో భాగంగా మానవ సిబ్బంది జాబిల్లిపైకి చేరతారు. చైనా నేషనల్ స్పేస్ అడ్మిని?రస్టేషన్, రష్యాకు చెందిన రస్‌కాస్మోస్ స్పేస్ ఏజెన్సీలు రెండు కలిసి "ఇంటర్నేషనల్ లూనార్ రీసెర్చ్ స్టేషన్"నిర్మాణం చేపడతాయి. ఏతావాతా... జాబిల్లిపైకి చేరడం ఎలా అన్నది 20వ శతాబ్ధపు అతిపెద్ద సాంకేతికపరమైన సవాలుగా నిలిస్తే... మనిషి అక్కడ ఎలా బతకాలన్నది ఈ శతాబ్ధపు ముఖ్యమైన ప్రశ్నగా అవతరిస్తోందన్నమాట!!!

## భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని: సిద్ధాంతి పార్థసారథి

**వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):** వినాయక చవితి పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని పరిగి మున్సిపల్ మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ అన్నారు. పరిగి పట్టణంలోని దాసాంజనేయ స్వామి దేవాలయంలో రజిత వెంకటేష్ ఉచితంగా మట్టి గణపతి లను పంపిణీ చేశారు ముఖ్యఅతిథిగా పిఏసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పంతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ మాట్లాడుతూ.. పండుగలు పర్యావరణానికి మేలు చేసే ఆలోచనతో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు




తెలిపారు. పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మండపాలలో ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గనిమోని శ్రీనివాస్, బాలు, రాజేందర్,నివాస్ చారి మల్లేష్,గణేష్,వంశీ,సిద్దు శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో సెగ.. ప్రపంచ వాణిజ్య మార్గాలకు గండం?!


ప్రపంచాన్ని ఎల్ నినో రూపంలో మరో సంక్షోభం వెంటాడే సూచనలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న దీని ప్రభావం.. నవంబర్, డిసెంబర్ నుంచి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ సహా అనేక దేశాలు ఈ పరిణామాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో.. ఎల్ నినో ప్రభావం ఇప్పుడు వాతావరణాన్ని దాటి ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన సముద్ర మార్గాలపైనా కనిపిస్తోంది. ఎల్ నినో అంటే కేవలం వర్షాలు, ఉష్ణోగ్రతలకు సంబంధించిన మార్పు మాత్రమే కాదు. సముద్ర ఉష్ణోగ్రతలు, వాతావరణ నమూనాల్లో వచ్చే మార్పులు.. నీటి లభ్యత నుంచి రవాణా వ్యవస్థల వరకు ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషించే నౌకాయాన మార్గాలు కూడా ఈ పరిణామాల నుంచి తప్పించుకోలేకపోతున్నాయి. నీటి మట్టాలు తగ్గడం, కరవు పరిస్థితులు పెరగడం వంటి పరిణామాలు అంతర్జాతీయ షిప్పింగ్‌కు సవాల్‌గా మారుతున్నాయి. దీనికి తాజా ఉదాహరణగా అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే పనామా కాలువ నిలుస్తోంది. ప్రపంచ వాణిజ్యంలో కీలకమైన ఈ జలమార్గం ద్వారా ప్రతి ఏడాది




వేలాది నౌకలు ప్రయాణిస్తాయి. అయితే పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా కాలువలో నీటి నిల్వలు తగ్గడంతో.. నౌకల రాకపోకలపై పరిమితులు విధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణ పరిస్థితుల్లో రోజుకు దాదాపు 40 నౌకలు ప్రయాణించే పనామా కాలువలో.. నీటి కొరత కారణంగా ఈ సంఖ్యను తగ్గిస్తున్నారు. దీనివల్ల సరకు రవాణా ఆలస్యం కావడం, నౌకల నిర్వహణ ఖర్చులు పెరగడం, చివరకు వినియోగదారులపై ధరల భారం పడే అవకాశం ఉంది. సెప్టెంబర్ నుంచి పరిమితులు మరింత కఠినం కావొచ్చని అంచనా వేస్తున్నారు.

### మరి హోర్ముజ్‌పై ప్రభావం ఉంటుందా?

ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఎల్ నినో ప్రత్యక్ష ప్రభావం చూపకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అక్కడి పరిణామాలు ప్రధానంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, భద్రతా పరిస్థితులు, దేశాల మధ్య సంబంధాలపైనే ఆధారపడి ఉంటాయి. అయితే ఎల్ నినో కారణంగా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం, ఇంధన వినియోగం, సరఫరా వ్యవస్థల్లో మార్పులు చోటుచేసుకుంటే.. పరోక్షంగా హోర్ముజ్ ద్వారా జరిగే చమురు రవాణాపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కరవు, పంటల నష్టం, రవాణా అంతరాయాలు పెరిగితే.. అంతర్జాతీయ



మార్కెట్లలో చమురు, ఆహార ధరలపై ఒత్తిడి పెరగొచ్చు. ప్రపంచ ఇంధన సరఫరాలో హార్ముజ్ జలసంధి కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో.. అక్కడ ఏ చిన్న అంతరాయం ఏర్పడినా దాని ప్రభావం ప్రపంచ మార్కెట్లపై కనిపించే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రత్యక్ష కారణం కాకపోయినా.. వాతావరణ మార్పులతో పెరిగే ఆర్థిక ఒత్తిళు ,, సరఫరా వ్యవస్థల్లో అస్థిరతలు ఇంధన రంగానికి కొత్త సవాళ్లుగా మారవచ్చు.

### ఇతర జలమార్గాలకూ ముప్పు

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే పొడి వాతావరణ పరిస్థితులు ప్రపంచంలోని మరికొన్ని కీలక జలమార్గాలపైనా ఒత్తిడి పెంచుతున్నాయి. అయితే ప్రతి ప్రాంతంలో దీనికి కారణాలు వేర్వేరుగా ఉంటాయి. తీవ్రమైన వేడి, తక్కువ వర్షపాతం, కరవు పరిస్థితులు కొనసాగితే నదులు, కాలువల్లో నీటి మట్టాలు తగ్గి.. నౌకా రవాణాకు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. యూరప్‌లోని రైన్ నది వంటి ప్రధాన నదీ మార్గాలు పరిశ్రమలు, సరకు రవాణాకు ఎంతో కీలకం. నీటి మట్టాలు తగ్గినప్పుడు పెద్ద నౌకలు పూర్తిస్థాయిలో



సరకు మోసుకెళ్లలేవు. దీంతో రవాణా సామర్థ్యం తగ్గడం, ఖర్చులు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయి. డాన్యూబ్ వంటి ఇతర కీలక నదీ మార్గాల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే.. ఇంధనం, ముడి సరుకులు, పారిశ్రామిక ఉత్పత్తుల సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంది. అంటే.. ఎల్ నినో ప్రభావం కేవలం సముద్రాల్లోనే కాదు.. నదులు, కాలువల ద్వారా జరిగే ప్రపంచ వాణిజ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. వాతావరణ మార్పులతో పెరుగుతున్న తీవ్ర పరిస్థితులు భవిష్యత్తులో రవాణా వ్యవస్థలకు కొత్త సవాళ్లుగా మారనున్నాయి.

### ప్రపంచ వాణిజ్యానికి మరో సవాల్

కరోనా మహమ్మారి తర్వాత ప్రపంచ సరఫరా వ్యవస్థలు ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, వాణిజ్య వివాదాలు సరఫరా గొలుసులను ప్రభావితం చేశాయి. ఇప్పుడు ఎల్ నినో కూడా మరో సవాల్‌గా మారుతోంది. ఒక ప్రాంతంలో కరవు కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు తగ్గడం.. మరో ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతినడం.. ఇవన్నీ కలిపి ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపవచ్చు. ముఖ్యంగా ఆహార పదార్థాలు, ముడి సరుకులు, ఇంధన సరఫరాలో మార్పులు వస్తే.. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

### భారత్‌కు ముప్పు ఎంత?

ఎల్ నినో ప్రభావం భారత్‌కు అత్యంత కీలకమైన అంశం. దేశ వ్యవసాయం ఎక్కువగా రుతుపవనాలపై ఆధారపడటం వల్ల వర్షపాతం మార్పులు నేరుగా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే పంటల దిగుబడి తగ్గడం, నీటి వనరులపై ఒత్తిడి పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది. అదే సమయంలో ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడితే.. చమురు, ఎరువులు, ఆహార దిగుమతుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది.

### వాతావరణం నుంచి ఆర్థిక వ్యవస్థ వరకు..

ఒకప్పుడు ఎల్ నినోను కేవలం వాతావరణ పరిణామంగా మాత్రమే చూశారు. కానీ ఇప్పుడు ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే శక్తిగా మారింది. సముద్ర మార్గాల నుంచి వ్యవసాయ క్షేత్రాల వరకు.. ఇంధన మార్కెట్ల నుంచి ఆహార సరఫరా వరకు.. ఎల్ నినో ప్రభావాలు అనేక రంగాలపై పడే అవకాశం ఉంది. పసిఫిక్ మహాసముద్రంలో మొదలైన ఈ పరిణామం.. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ప్రభావాలు చూపుతుందో రాబోయే నెలలు కీలకంగా మారనున్నాయి. అందుకే దేశాలు ముందుగానే అప్రమత్తమై.. సరఫరా వ్యవస్థలు, వ్యవసాయ ప్రణాళికలు, విపత్తు నిర్వహణ చర్యలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



# ఈనెల 14వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ఉండదు..

### జిల్లా ప్రజలు గమనించాలి –: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



అనంతపురం, మహి న్యూస్ సెప్టెంబర్ 13 : ఈనెల 14వ తేదీన సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం జరగదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు ఎవరూ రాకూడదని తెలిపారు.

# ఈ నెల14 సోమవారం (నేడు) పీజీ ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు

### పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి అర్జీల వివరాలు తెలుసుకోవచ్చు

### క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చు




అనంతపురము, మహి న్యూస్ సెప్టెంబర్13 : ఈ నెల14 సోమవారం (నేడు) వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి అర్జీలు ఇవ్వడానికి కలెక్టరేట్ కి రావొద్దని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. మీ కోసం వెబ్ సైట్ లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ప్రజలు మీ కోసం వెబ్ సైట్ Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. –పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

## జిల్లాలోని ప్రజలందరికీ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు

### ప్రజలు పర్యావరణ హిత మట్టి విగ్రహాలను పండుగలో వినియోగించండి




అనంతపురము, మహి న్యూస్ సెప్టెంబర్ 13: వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో పర్యావరణ హితంగా ఉత్సవాలు జరుపుకోవాలని పండుగ శుభాకాంక్షలను గౌ.జిల్లా ఇంచార్జి మంత్రి మరియు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, గౌ. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక మరియు శాసన సభ వ్యవహారాల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, శాసన మండలి సభ్యులు, ఎంఎల్ఏలు, జేసి సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల తదితరులు తెలిపారు. వినాయక చవితి ఎంతో పవిత్రమైన పండుగ అని, అన్ని విఘ్నాలను, సంకటాలను హరించి విజయాన్ని అందించే వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరి ఇంటా విఘ్నాలు తొలగి వారు ఆయు ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సౌభాగ్యాలతో సిరి సంపదలతో తుల తూగాలని సుహృద్భావ వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని, సహజ రంగులతో తయారు చేసిన మట్టి విగ్రహాలను ఉపయోగించాలని, పర్యావరణానికి హాని చేసే కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలను వాడరాదని, ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడేలా మట్టి వినాయకులని ఉపయోగించాలని, సామరస్య, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.





## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలేరు వెంకన్నను పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్

కేసముద్రం సెప్టెంబర్ 13: ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలేరు వెంకన్నను కేసముద్రం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ ఆదివారం పరామర్శించారు.. ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న విషయం స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న సమ్మిగౌడ్, వెంటనే ఆయన నివాసానికి వెళ్లాడు. వెంకన్న ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని, కాంగ్రెస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా పూర్తిగా కోలుకుని, ఆరోగ్యంతో తిరిగి జనంలోకి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నరేటి కొమురయ్య, ఉపాధ్యక్షులు బండారు సత్తయ్య, కార్యదర్శి శీలం యాకన్నా, రాచర్ల రాములు, పేటేరు వెంకన్న, బోయిని ఉప్పలయ్య, కాలేరు రామ్మూర్తి, కొనతం శ్రీనివాస్, బండి అశోక్, దొంతరాబోయిన రమేష్, మంద కొమరయ్య, బత్తుల రమేష్, భారతల రవి,కండ నాగన్న, కందే నాగేష్, గౌండ్ల కళ్యాణ్, అల్లాడి వెంకన్న, సోమరాపు హైదర్, నాగుల వెంకన్న, రాచర్ల నిరంజన్, గొండ్యాల శ్రీనివాస్, గొడిశాల చిరంజీవి, బత్తుల వీరన్న, తీగల దశరథం, ఉమయ్య, నరేటి మల్లేష్, వల్లాల రాజేందర్, శ్రావణ్, కందుకూరి రాంబాబు, కోమీరా ప్రశాంత్, బూరుగడ్ల యాకన్న, రాచర్ల ప్రభాకర్, కాలేరు అవినాష్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

### – ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీషాదేవి



రాజవొమ్మంగి సెప్టెంబర్ 14 : పోలవరం జిల్లా బ్యూరో: రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మరియు రంపచోడవరం ఎమ్మెల్యే ఆదివారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత సమస్యలను పరిశీలించి అధికారులతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీషాదేవి తెలిపారు. అనంతరం వట్టిగెడ్డ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గారు పార్టీ శ్రేణులకు సూచించారు.

# తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందుబాటులోకి

### పెరుగుతున్న బియ్యం ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు

అనంతపురము, మహి న్యూస్ సెప్టెంబర్ 13: బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను దృష్టిలో ఉంచుకుని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లాలో మార్కెట్ జోక్య కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ తెలిపారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో నాలుగు ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు బియ్యం విక్రయిస్తున్నారు.

**ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు:**

**అనంతపురం పట్టణం: రైతు బజారు**

గుంతకల్: సెంట్రల్ బ్యాంక్ పక్కన, పాత గుత్తి రోడ్డు,



కూరగాయల మార్కెట్ సమీపంలో

రాయదుర్గం: నేతాజీ రోడ్డు, రైల్వే స్టేషన్ సమీపంలో

తాడిపత్రి: పాత బస్టాండ్ సమీపంలోని ప్రధాన బజార్

ప్రస్తుతం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బియ్యం సరఫరాను మరింత విస్తరించడంతో పాటు, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సంయుక్త కలెక్టర్ తెలిపారు. ఆవిరి బియ్యం కిలో రూ.52, ముడి బియ్యం కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఆధార్ లేదా రేషన్ కార్డుపై 26 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను బట్టి అవసరమైన ప్రాంతాల్లో అదనపు ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, బియ్యం సరఫరాను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని సంయుక్త కలెక్టర్ సి. విష్ణు చరణ్ తెలిపారు. జిల్లా ప్రజలందరూ ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమకు సమీపంలోని ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల ద్వారా తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేసుకోవాలని ఆయన కోరారు.

# ఈనెల 16, 17, 18వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ అనంతపురం జిల్లా పర్యటన..

### జిల్లా పర్యటనకు రానున్న శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్, సభ్యులు దగ్గుపాటి ప్రసాద్, ప్రత్తిపాటి పుల్లారావు, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బోడే ప్రసాద్, సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, షాజహాన్ బాషా, సుందరపు విజయ్ కుమార్, ఐజాక్ బాషా.. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, మహి న్యూస్ సెప్టెంబర్ 13 : ఈనెల 16, 17, 18వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ అనంతపురం జిల్లాలో పర్యటించనుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ మైనారిటీల సంక్షేమ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్, సభ్యులు దగ్గుపాటి ప్రసాద్, ప్రత్తిపాటి పుల్లారావు, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బోడే ప్రసాద్, సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, షాజహాన్ బాషా, సుందరపు విజయ్ కుమార్, ఐజాక్ బాషా జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు. వారి జిల్లా పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 16వ తేదీన బుధవారం ఉదయం 10.30 గంటలకు అమరావతి వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాలులో సభ్యుల సమావేశం అవుతారు. అక్కడి నుంచి విజయవాడకు వెళతారు. మధ్యాహ్నం 01:30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి ఉదయం 03.00 గంటలకు అనంతపురం చేరుకుంటారు. ఈనెల 17వ తేదీన గురువారం ఉదయం 10:00 గంటలకు అనంతపురంలోని శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మైనారిటీలకు రిజర్వేషన్ల అమలు నిమిత్తం విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్‌తో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 02:00 గంటలకు అనంతపురం మరియు పరిసర ప్రాంతాల్లోని మైనారిటీల సంక్షేమ వసతి గృహాలు మరియు కళాశాలల సందర్శన చేస్తారు. అనంతరం అనంతపురంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో రాత్రి బస చేస్తారు. ఈనెల 18వ తేదీన శుక్రవారం ఉదయం 10.00 గంటలకు అనంతపురంలోని జెడ్.పి.హాల్‌లో మైనారిటీ సంక్షేమ సంస్థలు మరియు వ్యక్తుల నుండి వినతిపత్రాల స్వీకరణ చేస్తారు. మధ్యాహ్నం 2.00 గంటలకు అనంతపురం జిల్లాలో మైనారిటీల ప్రయోజనం కోసం చేపట్టిన సేవలలో రిజర్వేషన్ల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాలపై చర్చించడానికి అనంతపురం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మరియు ఇతర జిల్లా అధికారులతో సమావేశం అవుతారు. సాయంత్రం 5.00 గంటలకు అధికారులచే అనంతపురం మరియు దాని పరిసర ప్రాంతాలలోని ముఖ్యమైన ప్రదేశాల సందర్శన ఏర్పాటు చేయబడింది. రాత్రి 09.00 గంటలకు అనంతపురం నుంచి విజయవాడ బయలుదేరి వెళతారు.

# ఏజెన్సీ ప్రాంత ఎస్సీల అభివృద్ధి సంక్షోభంలో పడింది

### హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం.

### వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13. కొత్తగూడెం : ఏజెన్సీ ప్రాంత పేరుతో ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో పడింది.ఎస్సి కులాలకు స్థానిక ఎస్సీరిజర్వేషన్ అమలయ్యే వరకు పోరాడుదాం అని పిలుపునిచ్చారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా షెడ్యూల్ కులాల హక్కుల పోరాట జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా షెడ్యూల్ కులాల హక్కుల పోరాట జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ మరియు షెడ్యూల్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర కమిటీ అడ్వైజర్ సింగరేణి మాజీ జిఎం సెనగ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బిఆర్ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో తొలగించిన స్థానిక ఎస్సీ రిజర్వేషన్ తిరిగి అమలు చేయాలని అదేవిధంగా ఏజెన్సీ ప్రాంత ఎస్సీలు నివాస ఇంటిపై తరతరాల సాగు భూములకు, పోడు భూములకు ఆంక్షలు లేకుండా అక్కుపత్రాలు ఇవ్వాలి మరియు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఎస్సీ జనాభా పెరిగినందున ఎస్సీ రిజర్వేషన్లు 20% పెంచాలని కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.షెడ్యూల్ కులాలు ఏజెన్సీ ప్రాంతం పేరుతో కోల్పోయిన స్వతంత్ర హక్కులను సాధించడానికి గ్రామ గ్రామాన చైతన్య సభలు సమావేశాలు జరపాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత ఎస్సిలంతా పార్టీలకు,సంఘాలకు అతీతంగా హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు ముందుకు రావాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత షెడ్యూల్ కులాల ఉద్యమానికి ముందు వరుసలో మద్దతు తెలిపి రెండు దఫాలు అసెంబ్లీలో ప్రస్తావించిన సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు అదేవిధంగా నియోజకవర్గాల శాసనసభ్యులు పినపాక పాయం వెంకటేశ్వర్లు,ఇల్లందు కోరం కనకయ్య,భద్రాచలం తెల్లం వెంకట్రావు, వైరా మాలోత్ రాందాస్ నాయక్,సత్తుపల్లి మట్ట రఘుమై లకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయంపై గత పార్టీలు, సంఘాలు స్పందించాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి ఎన్నో దఫాలుగా వినతి పత్రాలు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని ఎస్సీ సామాజిక వర్గాల మంత్రుల దృష్టికి తీసుకుపోతే చర్చల పేరుతో నెలల తరబడి కాలయాపన చేస్తున్నారని వారికి కనువిప్పు కలిగించడానికి లక్షలాది గొంతులు ఏకం కావాలని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ రచయిత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పోరాడి సాధించిపెట్టిన రిజర్వేషన్ నిజమైన పేదల పక్షాన నిలబడి పోరాడటానికి అంబేద్కర్ వారసులుగా ముందుకు రావాలని కోరారు.ఈ సమావేశానికి అధ్యక్షతన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోద రమేష్ పాల్గొన్న నాయకులు బి.దేవదానం,మాజీ ఎంపీటీసీ దారా శ్రీనివాస్,షెడ్యూల్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్, షెడ్యూల్ కులాల యువజన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కర్లపూడి సుందర్ పాల్,సలిగంటి కొమరయ్య, గుర్రం లక్ష్మయ్య,బహుజన కళాకారుడు చింతల కనకయ్య.కాకాటి బాబు, పీడియాల వెంకటేశ్వర్లు, వంకాయల నగేష్,కీసరి నరసయ్య,కనకం రాములు,గుంట మల్ల వీరస్వామి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి

### పార్లమెంటులోనూ ప్రజా పోరాటాల్లోనూ కార్మిక కర్షక అణగారిన వర్గాల గొంతుక ఏచూరి.

### సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం.



భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13. కొత్తగూడెం : ప్రపంచం గర్వించదగిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి అని సిపిఎం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు.స్థానిక కమ్మ కళ్యాణ మండపంలో సిపిఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం బండారు రవికుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిన ప్రతిసారీ ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించిన గొంతు,లౌకికవాదంపై దాడి జరిగిన ప్రతిసారీ గట్టిగా ప్రతిఘటించిన స్వరం కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఎర్రజెండా నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు.మార్క్సిజాన్ని కేవలం అధ్యయనం చేయకుండా,ఆ సిద్ధాంతాన్ని ప్రజాజీవితంలో ఆచరణకు తీసుకువచ్చిన దార్శనికుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అన్నారు.ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడిగా, మార్క్సిస్టు సిద్ధాంతవేత్తగా దేశ రాజకీయా ల్లో తనదైన ముద్రవేసిన ఏచూరి గురించి తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదనీ తెలిపారు. ప్రజా సమస్యలపై పదునైన వాదన, మార్క్సిజంపై లోతైన అధ్యయనం, ప్రజా ఉద్యమాల పట్ల అచంచలమైన నిబద్ధత ఆయన రాజకీయ జీవితానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయనీ అన్నారు.రాజకీయ సమానత్వం మరియు సామాజిక-ఆర్థిక అసమానతల మధ్య వైరుధ్యం గురించి, మార్క్సిస్టు దృక్పథం నుంచి కామ్రేడ్ ఏచూరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన ఒక ముఖ్యమైన హెచ్చరికను తరచూ ప్రస్తావించేవారనీ అన్నారు. 'ఒక వ్యక్తి -- ఒక ఓటు' అనే రాజకీయ సమానత్వం మాత్రమే సరిపోదనీ,అది నిజమైన ప్రజాస్వామ్యంగా మారాలంటే 'ఒక వ్యక్తి -- ఒక విలువ' అనే ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని కూడా సాధించాల్సి ఉంటుందనీ తెలిపారు. అంటే ప్రతి వ్యక్తికి ఓటు విలువ సమానంగా ఉండటమే కాకుండా సమాజంలో అతని జీవితం, శ్రమ, హక్కులు, అవకాశాలకు కూడా సమాన విలువ ఉండాలనీ ఏచూరి సూచించారని అన్నారు. ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటం వర్గపోరాటంతో విడదీయ రానిదని ఏచూరి బోధించేవారన్నారు. అందువల్ల కార్మికవర్గానికి సాధికారత కల్పించడం, వ్యవసాయ కార్మికుల హక్కులను పరిరక్షించడం, యువతకు విద్య, ఉపాధి కల్పించడం, ప్రభుత్వ నిధులతో నాణ్యమైన విద్య అందించడం, ప్రజలకు అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు కల్పించడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, మహిళా సాధికారతను సాధించడం వంటి అంశాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అవసరం అని తన విలువైన భావనలు ప్రత్యామ్నాయ విధానాలతో భారత రాజకీయ ముఖ చిత్రంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించాడనీ తెలిపారు.ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం, లౌకిక ప్రజాస్వామ్య భారతదేశ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడటం కామ్రేడ్ సీతారాం ఏచూరికి మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు.

**లౌకిక విలువల రక్షణకై పోరాడిన నేత**

**సీతారాం ఏచూరి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

**బండారు రవికుమార్**

ప్రజాస్వామ్య భారత దేశాన్ని,లౌకిక విలువలు కాపాడటంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు.దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ప్రతి సందర్భంలో ఏచూరి దిక్సూచిగా వ్యవహరించాడని తెలిపారు.పార్లమెంటు లోపల పార్లమెంటు వెలుపల ప్రజా సమస్యలను జోడించి పోరాడిన యోధుడు ఏచూరి అని అన్నారు.విద్యార్థి దశలోనే ప్రధాన మంత్రిని ప్రశ్నించిన గొప్ప పోరాట యోధుడని అన్నారు.ప్రస్తుత భారత దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగానికి ,రాజ్యాంగ విలువలకు ప్రమాదం పొంచి ఉందని,ఏచూరి తన తుది శ్వాస వరకు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడారని, లౌకిక శక్తులను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా లౌకిక విలువల రక్షణకై ఏచూరి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నవరపు సత్యనారాయణ ఏం జ్యోతి ఎంబి నర్సారెడ్డి కారం పుల్లయ్య కె బ్రహ్మాచారి లిక్కి బాలరాజు రేపాకుల శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ,ఎస్ఏ నబి దొడ్డ రవికుమార్ గడ్డం స్వామి నిమ్మల వెంకన్న వీర్ల రమేష్ పద్మ చిలకమ్మ కొండబోయిన వెంకటేశ్వర్లు భూక్య రమేష్ కోబల్ సాంబశివ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/26/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

## వినాయక చవితి సెలవు.. పీ.జీ.ఆర్.ఎస్ లేదు



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 13 : వినాయక చవితి పండగ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) సోమవారం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ అంశాన్ని గుర్తించి వ్యయ ప్రయాసలకు లోనై రావద్దని కోరారు.

## 16లోగా కొత్త పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవాలి

గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 13 : కొత్త పింఛన్లకు ఈ నెల 16వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. దరఖాస్తు చేయుటకు గడువు ఇంకా రెండు రోజులు మాత్రమే ఉందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అర్హత కలిగిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజాగా దరఖాస్తు చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు సంబంధిత శాఖల అధికారులు - జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్, మత్స్యశాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, చేనేత - జౌళి శాఖ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారని చెప్పారు. వృద్ధాప్య పించనుకు వయస్సు ధృవీకరణ (ఆధార్) పత్రం, వితంతు పించనుకు భర్త ఆధార్, మరణ ధృవీకరణ పత్రాలు, ఒంటరి మహిళా పించనుకు అవివాహిత కేటగిరిలో సంబంధిత తహశీల్దారు జారీ చేసిన ఒంటరి మహిళా (ాఱఅస్త్రశ్రీవ ఔశీఎవఅ) ధృవీకరణ పత్రం, వివాహిత కేటగిరిలో కోర్టు ఆదాలత్ ద్వారా జారీ చేసిన విడాకుల ధృవీకరణ పత్రం, దివ్యాంగుల పించనుకు 40 శాతం అంతకు మించి అంగవైకల్యము కలిగిన సదరం ధృవీకరణ పత్రంను దరఖాస్తుతో పాటు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలలో 16వ తేదీ లోగా సమర్పించాలని తెలిపారు. డప్పు కళాకారులు ప్రస్తుతం స్వయం ధృవీకరణ పత్రంను సమర్పిస్తే సరిపోతుందని చెప్పారు. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అన్ని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ దరఖాస్తు సేవ అందుబాటులో ఉందన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు, విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల అందజేత




గుంటూరు, ఏప్రిల్ 13: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయం, గుంటూరు సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ భీమనేని వందనా దేవి ఆధ్వర్యంలో గ్రంథాలయ సంస్థ ఉద్యోగులతో పాటు గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. వినాయకుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని భీమనేని వందనా దేవి ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పండుగల సందర్భంగా ప్రకృతికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## అటవీ ఆక్రమణలు, వన్యప్రాణుల వేటపై ప్రత్యేక నిఘా

### వినాయక చవితి నేపథ్యంలో మూడు రోజుల పాటు అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు







పల్నాడు, మహి న్యూస్ । సెప్టెంబర్ 13: వినాయక చవితి పండుగతో వరుసగా వచ్చిన సెలవులను దృష్టిలో ఉంచుకుని అటవీ ఆక్రమణలను అరికట్టడంతో పాటు వన్యప్రాణుల వేటను పూర్తిస్థాయిలో నివారించేందుకు పల్నాడు జిల్లా అటవీ శాఖ అప్రమత్తమైంది. జిల్లా అటవీశాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని నరసరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ అటవీ రేంజ్‌ల పరిధిలోని వల్నరబుల్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అటవీ శాఖ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పగలు, రాత్రి వేళల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ ప్రవేశాలు, ఆక్రమణలు, వన్యప్రాణుల వేటకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఉంచారు. అనుమానాస్పద కదలికలు కనిపించిన వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. పండుగ సెలవుల సమయంలో అటవీ సంపదకు, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక బృందాలు నిరంతరం విధులు నిర్వహిస్తున్నాయి. అటవీ సంరక్షణకు ప్రజలు కూడా సహకరించాలని అటవీ శాఖ అధికారులు కోరారు.

## పి.ఓ.పి. బొమ్మ వద్దు.. మట్టి బొమ్మే ముద్దు!.



యానాం, మహి న్యూస్, సెప్టెంబర్ 13: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ మల్లాడి శామ్యూల్ హాజరయ్యారు. మట్టి విగ్రహాలు పర్యావరణహితమైనవని, నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో



పాటు సులభంగా ప్రకృతిలో కలిసిపోతాయని నిర్వాహకులు తెలిపారు. మట్టి గణపతిని పూజించడం ద్వారా నీటిని, ప్రకృతిని కాపాడుతూ భావితరాలకు పచ్చని భూమిని అందించవచ్చన్నారు. ఈ సందర్భంగా శేరు కృష్ణ, గూటం శివ గణేష్, షేక్ రహీం, పెద్దిరెడ్డి బాబీ, పాలేపు సూరిబాబు, పైడిమళ్ల జయకుమార్, షేక్ ఇమ్రాన్, నాటి రాజు, కొక్కిలిగడ్డ కిరణ్, వడ్డీ మురళీ, పొతబత్తుల రాజు, మల్లాడి వెంకట్, మల్లాడి వర్మ తదితరులు పాల్గొన్నారు. మట్టి గణపతినే ఎంచుకుందాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం!

# హెల్మెట్ లేకుంటే ఇక చర్యలు తప్పవు

### మల్లవరం చెక్‌పోస్ట్ వద్ద కోరంగి పోలీసుల విస్తృత తనిఖీలు. 25 మందితో అక్కడికక్కడే కొత్త హెల్మెట్లు కొనుగోలు చేయించి ధరింపజేసిన పోలీసులు.

తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 13: రహదారి భద్రత, వాహనదారుల ప్రాణ రక్షణే లక్ష్యంగా తాళ్లరేవు మండలంలోని మల్లవరం చెక్‌పోస్ట్ వద్ద కోరంగి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి--216పై మల్లవరం చెక్‌పోస్ట్ వద్ద కోరంగి ఎస్ఐ



సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనాలను పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి, వారి వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర అవసరమైన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను




కాపాడుకునే అవకాశం ఉంటుందని వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించారు.

### 25 మందికి అక్కడికక్కడే హెల్మెట్లు

తనిఖీల్లో భాగంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న 25 మంది వాహనదారులతో అక్కడికక్కడే కొత్త హెల్మెట్లు కొనుగోలు చేయించి, వాటిని ధరింపజేసిన అనంతరం వారి వాహనాలను పోలీసులు అప్పగించారు. హెల్మెట్ ధరించడం కేవలం పోలీసుల భయంతో కాకుండా ప్రతి ఒక్కరి ప్రాణ రక్షణ కోసం తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత అని ఎస్ఐ సత్యనారాయణ వాహనదారులకు సూచించారు.

### పత్రాలు లేకున్నా చర్యలు

వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన పత్రాలను కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సరైన వాహన పత్రాలు లేకుండా రోడ్డుపై వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు. వాహనదారులు పోలీసుల తనిఖీలను ఇబ్బందిగా భావించకుండా రహదారి భద్రతలో భాగంగా సహకరించాలని కోరారు.

### మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు.


మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని ఎస్ఐ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుని, అవసరమైతే జైలు శిక్ష విధించేలా కేసులను కోర్టులో ప్రవేశపెడతామని హెచ్చరించారు.

### నిబంధనలు పాటించాలి

జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరంగి పోలీసులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాన్ని నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. వేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సరైన పత్రాలు లేకుండా ప్రయాణించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు కోరారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు మల్లవరం చెక్‌పోస్ట్ వద్ద ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అందుకున్న అజ్మీర సురేష్ నాయక్‌కు అభినందనలు

### తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు. ఎన్ ఎస్ యు ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు అందుకున్న అజ్మీర సురేష్ నాయక్‌కు ఘన సన్మానం.




భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13. కొత్తగూడెం: ఎన్ ఎస్ యు ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు అందుకున్న అజ్మీర సురేష్ నాయక్‌ను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ, విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న అజ్మీర సురేష్ నాయక్‌కు వరుసగా రెండోసారి ఎన్ ఎస్ యు ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు లభించడం అభినందనీయమని అన్నారు. నూతన బాధ్యతల్లో ఆయన మరింత విజయవంతంగా రాణించాలని, విద్యార్థి సమస్యలపై మరింత చురుగ్గా పనిచేస్తూ ఎన్ ఎస్ యు ఐ కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అజ్మీర సురేష్ నాయక్ గతంలో నిర్వహించిన బాధ్యతలను గుర్తుచేస్తూ, విద్యార్థులు మరియు యువత సమస్యలపై ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని నాగా సీతారాములు గారు పేర్కొన్నారు. మరోసారి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఆయనపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని, ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉన్నత అవకాశాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి వరుసగా రెండోసారి ఎన్ ఎస్ యు ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అందించిన పార్టీ పెద్దలకు, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకత్వానికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా విద్యార్థుల పట్ల తనకున్న బాధ్యతగా భావిస్తానని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి విద్యార్థికి అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా రంగ అభివృద్ధి, యువతకు మెరుగైన అవకాశాల కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వం చూపిన మార్గంలో నడుస్తూ ఎన్ ఎస్ యు ఐ ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరింత బలోపేతం చేయడంతో పాటు, విద్యార్థులను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అజ్మీర సురేష్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా తనను ఆత్మీయంగా సన్మానించి, నూతన బాధ్యతలపై హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు కి అజ్మీర సురేష్ నాయక్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అజ్మీర సురేష్ నాయక్ కూడా నాగా సీతారాములు గారిని శాలువాతో ఘనంగా సన్మానించి, ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సొసైటీ ఛైర్మన్ మండే హనుమంతు రావు, యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబీత్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు బానోత్ శ్రీధర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

# కోతులగుట్ట గురుకుల విద్యార్థిని తెల్లం జాహ్నవి మృతిపై జిల్లా కలెక్టర్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

### పోలవరం జిల్లా కలెక్టర్, రాష్ట్ర హెల్త్ సెక్రటరీలకు ఎన్ సి ఎస్ టి తీవ్ర హెచ్చరిక
### 15 రోజుల్లోగా సమగ్ర విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశం
### వివరణ ఇవ్వకపోతే సివిల్ కోర్టు అధికారాలతో సమన్లు జారీ చేస్తామని స్పష్టీకరణ
### ప్రిన్సిపాల్‌పై ఎఫ్ఐఆర్, సస్పెన్షన్ మరియు బాధిత కుటుంబానికి నష్టపరిహారం కోరిన ఆదివాసీ సంక్షేమ పరిషత్

కూనవరం సెప్టెంబర్ 14 పోలవరం జిల్లా బ్యూరో.: పోలవరం జిల్లా కునవరం మండలం కోటులగుట్ట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని తెల్లం జాహ్నవి వైద్య నిర్లక్ష్యంతో మృతి చెందిన దారుణ ఘటనపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్ సి ఎస్ టి) తీవ్రంగా స్పందించింది.




ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను సమర్పించిన ఆధారాలతో కూడిన ఫిర్యాదును స్వీకరించిన కమిషన్, ఈ దారుణ ఘటనపై ఫైల్ నెంబర్: ఎన్ సి ఎస్ టి/ఏ టి వై - 4646/ఏపీ/544/2026--ూ-దీఎఖఎ/ఆర్ యు -ఐ ఐ ఐ ద్వారా పోలవరం జిల్లా కలెక్టర్ ఒ మెజిస్ట్రేట్ మరియు రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి అధికారికంగా నోటీసులు జారీ చేసింది. అధికారుల నిర్లక్ష్యంపై ఎన్ సి ఎస్ టి విచారణ: కోటులగుట్ట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి. రాధిక పద్మశ్రీ చూపిన తీవ్ర నిర్లక్ష్యం, కోటులగుట్ట సీహెచ్‌సీ (సి హెచ్ సి) వైద్య సిబ్బంది వైఫల్యం వల్లనే అమాయక గిరిజన విద్యార్థిని ప్రాణాలు కోల్పోయిందని, ఈ అంశంపై భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ ప్రకారం కమిషన్ నేరుగా విచారణకు స్వీకరించిందని కుంజ శ్రీను తెలిపారు. బాధ్యులైన ప్రిన్సిపాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, ఉద్యోగం నుండి సస్పెండ్ చేయడం, వైద్య యంత్రాంగం వైఫల్యాలపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి తక్షణ పరిహారం అందించాలన్న డిమాండ్లపై 15 రోజుల్లోగా (15 రోజులు) యాక్షన్ టేకన్ రిపోర్ట్ (ఏ టి ఆర్) సమర్పించాలని కమిషన్ డైరెక్టర్ డాక్టర్ పి. కళ్యాణ్ రెడ్డి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

### సమన్లు జారీ చేస్తామని హెచ్చరిక:



కమిషన్ కేటాయించిన నిర్ణీత సమయంలోగా జిల్లా యంత్రాంగం నుండి సరైన వివరణ రాకపోతే, రాజ్యాంగం కల్పించిన సివిల్ కోర్టు అధికారాలను ఉపయోగించి అధికారులను స్వయంగా హాజరయ్యేలా సమన్లు (సమ్మన్స్) జారీ చేస్తామని నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారని శ్రీను తెలిపారు. ఇకనైనా జిల్లా అధికారులు గిరిజన విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటం విడనాడి, తక్షణమే బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో జాతీయ కమిషన్ వేదికగా చట్టపరమైన పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ స్పష్టం చేసింది. (మాధ్యమాలకు విజ్ఞప్తి: జాతీయ ఎస్టీ కమిషన్ జారీ చేసిన అధికారిక నోటీసు ప్రతిని పత్రికా ప్రకటనతో పాటు జత చేయడం జరిగింది).

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట అభయ హస్తంలా నిలుస్తోంది



చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 13 : ముఖ్యమంత్రి సహాయనిధి,.. పేదల పాలిట ఆపన్న హస్తంలా తోడ్పాటునందిస్తోందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ సమాజంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర సమయాల్లో ఆసరాగా నిలుస్తోందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధి (ఏపీ సీఎంఆర్ఎఫ్) ద్వారా నిరుపేదలకు, ఆప్తులకు ఆర్థిక సాయాన్ని అందిస్తూ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొంటున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., అదే పందాలో తాను సిఫారసు చేసి,.. ముఖ్యమంత్రి సహాయ నిధి ధ్వారా మంజూరైన 9,37,553 రూపాయల విలువచేసే చెక్కులను, 19 మంది లబ్ధిదారులకు ఆదివారం చిత్తూరులోని ఎంపీ కార్యాలయంలో, బాధితులకు పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు విషయంలో తీసుకున్న చొరవను అభినందనీయమని ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. ముఖ్యమంత్రి స్ఫూర్తితో తాను పేదలకు అండగా నిలుస్తున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు.

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఆం.ప్ర రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్న సందర్భంగా భద్రత ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

తిరుపతి, సెప్టెంబర్ 13 (మహి న్యూస్) :: ఈ నెల 15, 16 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించడానికి జిల్లాకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు, బందోబస్తు విషయంలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, మునిసిపల్ కమీషనర్ ఎమ్. జయకృష్ణ లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రేణిగుంట ఎయిర్పోర్ట్ నందు ముందస్తు భద్రత ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, నగర పాలక కమీషనర్ ఎమ్. జయకృష్ణ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆం.ప్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావివ్వరాదని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటించే అన్ని ప్రదేశాల్లో కూడా విధులు కేటాయించిన అధికారులు అందరూ సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు. మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయం చేసుకోవాలన్నారు. సేఫ్టీ రూమ్, అధునాతన లైఫ్ సపోర్ట్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, ఏపీ ఎస్పీడీసీఎల్ ద్వారా విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, శానిటేషన్ ఏర్పాట్లు, కాన్వాయ్ వాహనాలు, హెలిపాడ్ భద్రత, ప్రోటోకాల్ అంశాలు తదితర విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, అడిషనల్ ఎస్పీలు రవిమనోహర్ అచ్చారి, శ్రీనివాస రావు, శ్రీనివాసులు, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఈ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి మురళి మోహన్, ఎయిర్పోర్ట్ అధికారి భూమినాథన్, జిల్లా అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మరియు భద్రతా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

**ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడకాన్ని వీడాలి.**

**మట్టి వినాయకులను పూజించి ఆదర్శంగా నిలవాలి.**

**కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్.**



భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13. కొత్తగూడెం : మట్టి విగ్రహాలను పూజించడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరూ బాధ్యతగా మట్టి వినాయకులనే ప్రతిష్టించాలని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కొత్తగూడెం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు తీవ్రంగా కలుషితమై జీవరాశులకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతికి ఎటువంటి హాని కలగకుండా సాంప్రదాయబద్ధంగా పండుగలను జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. కార్పొరేషన్ చేపట్టిన ఈ మట్టి విగ్రహాల పంపిణీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు పర్యావరణ హిత పద్ధతులను పాటించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిగడప పద్మ, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, బోయిన విజయ్ కుమార్, సుప్రియ,శాంతిప్రియ, శహేరా అహ్మద్, ధనలక్ష్మి, నాగలక్ష్మి, హరిత, దర్గయ్య, హిమశ్రీ, దాసరి శ్రీనివాస్, కళావతి, స్థానికులు సత్యనారాయణాచారి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయుధ పోరాట త్యాగాలు చిరస్మరణీయం

**చరిత్రను వక్రీకరించే కుట్రలను తిప్పికొడదాం.**

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్.**



భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13. కొత్తగూడెం : వీరోచిత తెలంగాణ సాయుధ పోరాట త్యాగాలు చిరస్మరణీయమని, కమ్యూనిస్టుల రక్తతర్పణంతోనే నిజాం నిరంకుశ పాలన అంతమైందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. సిపిఐ కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాతకొత్తగూడెం సెంటర్లో సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత ఎర్రజెండాను ఆవిష్కరించి, అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ విముక్తి కోసం, భూమి, భుక్తి కోసం నాలుగు వేల మందికి పైగా అమరులై రక్తతర్పణం చేసిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. నాటి పోరాటంలో కనీస పాత్ర లేని మతోన్మాద కాషాయ శక్తులు నేడు చరిత్రను మత కోణంలో వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాయని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజల ఐక్యతతో సాగిన చారిత్రక విప్లవాన్ని వక్రీకరించే కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని, అమరుల ఆశయాల సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి వీరస్వామి, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, భూక్య శ్రీనివాస్, పట్టణ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, తెల్లాకుల భాస్కర్, మల్లేష్, రవికిరణ్, కాశి, నాగరాజు, సాంబిరెడ్డి, కార్పొరేటర్ నాగలక్ష్మి మంగ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నినోను ఎదుర్కొనేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు



అమరావతి, మహి న్యూస్, సెప్టెంబర్ 13: రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని, తేమ ఒత్తిడికి గురవుతున్న పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్-నినో పరిస్థితులు, వర్షపాతం, ఖరీఫ్ సాగు, పంటలపై ప్రభావం, పంట ఆరోగ్య పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుబాటులో ఉన్న నీటి వనరులతో పంటలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తేమ ఒత్తిడికి గురైన ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడేందుకు రక్షక తడులు అందించాలని వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాధారణంగా 476.1 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 218.2 మి.మీ. మాత్రమే నమోదైందని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 54.2 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వర్షాభావ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఖరీఫ్-2026లో సెప్టెంబర్ 12 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 26.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని అధికారులు తెలిపారు. ఇది సాధారణ సాగు విస్తీర్ణంలో 74 శాతం కాగా, గత ఏడాది ఇదే తేదీ నాటి సాగుతో పోలిస్తే 78 శాతంగా ఉందన్నారు. ప్రధాన పంటల్లో వరి 12.01 లక్షల హెక్టార్లు, పత్తి 4.11 లక్షల హెక్టార్లు, కంది 2.63 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.47 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.08 లక్షల హెక్టార్లలో సాగైనట్లు వివరించారు. ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలోని 284 మండలాలు, 1,792 ఆర్ఎస్కేలు/గ్రామాల పరిధిలో పంటలపై ప్రభావం నమోదైనట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. మొత్తం 2,44,443 హెక్టార్లలో పంటలు వివిధ స్థాయిల్లో ప్రభావితమైనట్లు తెలిపారు. ఇందులో 1,92,387 హెక్టార్లలో తేమ ఒత్తిడి, 41,474 హెక్టార్లలో పంటలు వాడిపోవడం, మరో 10,582 హెక్టార్లలో పంటలు ఎండిపోవడం నమోదైనట్లు వివరించారు. ఈ పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ తేమ ఒత్తిడిలో ఉన్న పంటలను సాధ్యమైనంత వరకు కాపాడటమే ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఎప్పటికప్పుడు అందించాలని, అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా కర్నూలు జిల్లాలో అత్యధికంగా 1,09,255 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 80,751 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 32,456 హెక్టార్లలో పంటలు ప్రభావితమైనట్లు అధికారులు తెలిపారు. ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. పంటల వారీగా కంది 74,301 హెక్టార్లు, పత్తి 73,733 హెక్టార్లు, వేరుశనగ 25,818 హెక్టార్లు, మొక్కజొన్న 24,819 హెక్టార్లు, వరి 18,443 హెక్టార్లలో ప్రభావితమైనట్లు సమావేశంలో వివరించారు.

### 99.76 శాతం ప్లాట్ల సర్వే పూర్తి

ఈ-పంట, వీడజు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.7558 కోట్ల ప్లాట్లలో 2.7493 కోట్ల ప్లాట్ల సర్వే పూర్తయిందని, తద్వారా 99.76 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. కేవలం 65,233 ప్లాట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. పంట ఆరోగ్య వివరాలకు సంబంధించి 1.082 కోట్ల ప్లాట్లలో వివరాలు నవీకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 98.10 లక్షల ప్లాట్లలో నవీకరణ పూర్తయిందని అధికారులు వివరించారు. ఇంకా 10.10 లక్షల ప్లాట్లు, అంటే 9.34 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ పంట ఆరోగ్య వివరాల నమోదు కేవలం గణాంకాల కోసం కాకుండా, ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎలాంటి సమస్య ఉందో గుర్తించి సకాలంలో రైతుకు సహాయం అందించేందుకు అత్యంత కీలకమన్నారు. ప్రతి ప్లాట్‌లో పంట ఆరోగ్యాన్ని పర్యవేక్షించి, పెండింగ్‌లో ఉన్న వివరాల నవీకరణను వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇప్పటివరకు 34,567 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు చేపట్టినట్లు అధికారులు వివరించగా, ఇంకా 95,112 హెక్టార్లను కవర్ చేయాల్సి ఉందన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంటలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని మంత్రి ఆదేశించారు. రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు సహా అవసరమైన సహకారం అందుబాటులో ఉంచాలని సూచించారు.

### వ్యవసాయ--జలవనరుల శాఖల మధ్య నిరంతర సమన్వయం

తేమ ఒత్తిడికి గురైన పంటలకు అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి రక్షక తడులు అందించడంపై వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఏ ప్రాంతంలో పంటకు నీరు అత్యవసరమో గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో వినియోగించాలి. సాధ్యమైన ప్రతి పంటను కాపాడాలి. రైతుకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా క్షేత్రస్థాయిలో కనిపించాలి అని మంత్రి స్పష్టం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కింద సాగు చేసే రైతులు వరికాకుండా ఆరుతడి పంటలను పండించాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎల్-నినో పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయ--సహకార శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాజుని కుమారి, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్, జలవనరుల శాఖ కార్యదర్శి, ఐఏఎస్ రాజమౌళి, వ్యవసాయ, జలవనరుల శాఖలకు చెందిన వివిధ విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏలూరులో స్థానిక సంస్థల ఎన్నికలపై సమన్వయ సమావేశం..



ఏలూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 13: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏలూరులో కూటమి అభ్యర్థులు పోటీ చేసే ప్రతి స్థానంలో విజయం సాధించి 100% స్ట్రైక్ రేటును నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అమలాపురం మరియు ఏలూరు పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేటర్, రాష్ట్ర ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు.. ఆదివారం స్థానిక ఏలూరు జనసేన కార్యాలయంలో ఏలూరు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు.. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులు, మూడు పార్టీల సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు..

### కూటమి తరపున పోటీ చేయబోయే ప్రతి అభ్యర్థి గెలుపే లక్ష్యం:-

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసే ప్రతి అభ్యర్థి గెలుపే ఏకైక లక్ష్యంగా, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో బొలిశెట్టి శ్రీనివాస్ వివరించారు.. కూటమిలో జనసేన, టిడిపి, బీజేపీ పార్టీల నుండి ఏ పార్టీకి చెందిన అభ్యర్థి, పోటీ చేసినప్పటికీ, మిగిలిన రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు, పూర్తి సహకారం అందించి, అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.. కూటమిలో మూడు పార్టీల మధ్య ఐక్యత, పరస్పర సహకారంతో క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ గారు సూచించారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని బొలిశెట్టి శ్రీనివాస్ గారు వివరించారు.. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పనితీరు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్, కూటమి నాయకులు ప్రజలకు వివరించేలా కార్యాచరణ రూపొందించాలని ఆయన అన్నారు..

### గ్రామస్థాయి నుంచి సమన్వయం:-

స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి మండల మున్సిపాలిటీ కార్పొరేషన్ స్థాయి వరకు, పక్క ప్రణాళిక, సమన్వయంతో కూడిన ప్రణాళికను సిద్ధం చేయాలని బొలిశెట్టి శ్రీనివాసు గారు సూచించారు.. 3 పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య నిరంతరం సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, మూడు పార్టీల నాయకులు కలిసి పరిష్కరించుకునేలా సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు.. ఎన్నికలకు ముందుగానే క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, బలమైన అభ్యర్థుల ఎంపిక తో పాటు, ప్రచార వ్యూహాలను రూపొందించి, పక్క ప్రణాళికలో, ఎన్నికల బరిలోకి దిగాలని బొలిశెట్టి శ్రీనివాస్ గారు వివరించారు.. కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల బలం, స్థానిక పరిస్థితులు, ప్రజల మద్దతును పరిగణలోకి తీసుకుని, ఎన్నికల వ్యూహాన్ని రూపొందించాలని ఆయన సూచించారు..

### ఏలూరు నగర మేయర్ పీఠం జనసేనకు ఇవ్వాలని అధిష్ఠానానికి అభ్యర్థన..

రానున్న ఏలూరు నగర పాలకసంస్థ ఎన్నికల్లో మేయర్ పదవీ జనసేన పార్టీకి ఇవ్వాలని జనసేన పార్టీ అధిష్టానానికి తమ అభ్యర్థనను తెలియజేసినట్లు బొలిశెట్టి శ్రీనివాస్ గారు తెలిపారు.. జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులు కూడా ఇదే కోరుతున్నారు.. పార్టీ అధిష్టానం కోసం నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని తెలిపారు.. ఏలూరులో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు అందరూ కూడా ఎలాంటి వర్గ భేదాలు లేకుండా ఐకమత్యంతో పనిచేసి 100% స్ట్రైక్ రేటు విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు..

### అన్ని స్థానాల్లో విజయం సాధించాలి - రెడ్డి అప్పలనాయుడు:-

కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏలూరు పార్లమెంట్ స్థానిక ఎన్నికల సమన్వయకర్త రెడ్డి అప్పలనాయుడు అన్నారు.. ఏలూరు నియోజకవర్గం తో పాటు ఏలూరు జిల్లాలో కూటమి తరపున పోటీ చేసే ప్రతి అభ్యర్థి విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, సమిష్టిగా పనిచేసి అన్ని స్థానాల్లోనూ విజయం సాధించాలని రెడ్డి అప్పలనాయుడు స్పష్టం చేశారు.. తద్వారా ఏలూరు జిల్లాలోనే కూటమి ప్రభుత్వం 100% స్ట్రైక్ రేటు నమోదు చేసే దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.. మరోపక్క వైసీపీ నాయకులు కుట్రలకు తెరతీశారంటూ విమర్శలు గుప్పించిన ఆయన వాటన్నింటిని తిప్పికొట్టేందుకు తాము కూడా అంతే సమర్థవంతంగా ముందుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు.. ప్రతి నియోజకవర్గం లో పరిస్థితులను పరిశీలించి, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతున్నామన్నారు.. ఈ కార్యక్రమం లో ఏలూరు పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తలు నారా శేష, కస్తూరి సాయి తేజస్విని, సపోర్టింగ్ టీమ్ సభ్యులు తిరుపతి వాసు, వలవల తాతాజీ , జె. బిపిన్ కుమార్ (జనసేన రవి), వి. వెంకటేశ్వర్ రావు (నానాజీ), పాశం నాగబాబు, అడపా నాగబాబు, సూరత్తుల రాఘవ అయ్యప్ప, రాష్ట్ర చేనేత కార్యదర్శి దోనేపూడి లోవరాజు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కావూరి వాణిశ్రీ, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి, శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నిమ్మల జ్యోతి కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, ఏలూరు నియోజకవర్గం జనసేన పార్టీ నగర అధ్యక్షులు వీరంకి పండు, గౌరవ అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రోగ్రాం కమిటీ అధ్యక్షులు రెడ్డి గౌరీ శంకర్, భారీ సంఖ్యలో జిల్లా నాయకులు, నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా కోలా కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

**నియామక పత్రం అందచేసిన డి జే ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్.**



భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13. కొత్తగూడెం : కొత్తగూడెం సెప్టెంబర్ 13 న దళిత జర్నలిస్ట్ ఫోరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా కోలాకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. డేవిడ్ రాష్ట అధ్యక్షులు యాదగిరి సూచనలతో నియామక పత్రం అందచేసిన తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ల డి జే ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ తన కథనాలతో అధికారులను కదిలిస్తూ ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న కోలా కుమార్ సమర్ధ వంతంగా నిర్వహిస్తారని బాధ్యతలు అప్పగించడం జరిగింది. . ప్రస్తుతం టీయూడబ్ల్యూజే- ఐజేయు యూనియన్ కొత్తగూడెం డివిజన్ ఉపాధ్యక్షులుగా కోలా కుమార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని దళిత జర్నలిస్టులను ఐక్యం చేస్తూ, వారి హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తారని రాష్ట్ర నాయకత్వం ఆకాంక్షించింది. కోలా కుమార్ ఎన్నికపై ఫోరం నాయకులు, సభ్యులు, జర్నలిస్టు మిత్రులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# వినాయక చవితిని భక్తితో జరుపుకోవాలి

**ఐక్యత, సుఖసంతోషాలతో పండుగ వేడుకలు జరుపుకుందాం.**

**మండపాల వద్ద పారిశుద్ధ్యం, విద్యుత్ విస్తృతంగా చేపట్టాలి.**

**ఉత్సావాల సందర్భంగా గట్టి బందోబస్తు కల్పించాలి.**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.**



భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 13. కొత్తగూడెం : వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో, సుఖసంతోషాల నడుమ కలిసిమెలిసి జరుపుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఆదివారం ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు, బస్తీలు, ప్రధాన కూడళ్లలో పెద్దఎత్తున ప్రతిష్టించిన వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మండపాల పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని, రాత్రి వేళల్లో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించేలా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
కర్నూలు - నంద్యాల
సోమవారం - 14 - సెప్టెంబర్ - 2026

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి, ఐశ్వర్యం నిండాలి

### పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి: మంత్రి టీజీ భరత్



కర్నూలు, సెప్టెంబర్ 13: (మహి న్యూస్): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కృపతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరి జీవితాల్లో శాంతి, ఐశ్వర్యం, ఆనందం వెల్లివిరియాలని మంత్రి కోరుకున్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి టీజీ భరత్ సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా పండుగ వేడుకలు నిర్వహించాలని ఆయన కోరారు.

## గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభం కలగాలి

### పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి: కలెక్టర్ డా.ఏ.సిరి




కర్నూలు, సెప్టెంబర్ 13: (మహి న్యూస్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుడి కృపతో కర్నూలు జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, ప్రతి ఒక్కరూ చేపట్టే పనుల్లో విజయం సాధించాలని కలెక్టర్ కోరుకున్నారు. వినాయక చవితిని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని, పర్యావరణహితంగా పండుగ వేడుకలను జరుపుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బంగారుపేటలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్

### 15 లీటర్ల నాటుసారా స్వాధీనం.. 60 లీటర్ల సారా ఊటబెల్లం ధ్వంసం



కర్నూలు, సెప్టెంబర్ 13: (మహి న్యూస్): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర పర్యవేక్షణలో ఆదివారం కర్నూలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుపేటలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ, ఈగల్ టీమ్ సంయుక్తంగా ఈ తనిఖీలను చేపట్టారు. కర్నూలు నగర సీఐలు, పోలీసు సిబ్బందితో పాటు ఎక్సైజ్ శాఖ ఏఈఎస్‌లు, సీఐలు, సిబ్బంది, ఈగల్ టీమ్ సభ్యులు ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 60 లీటర్ల నాటుసారా ఊటబెల్లాన్ని గుర్తించి ధ్వంసం చేశారు.



### నాటుసారా తయారీ, విక్రయాలకు దూరంగా ఉండాలి



నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రాంతాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించిన వెంటనే డయల్ 112, డయల్ 100 లేదా ఈగల్ టోల్‌ఫ్రీ 1972కు సమాచారం అందించాలని డీఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నగర సీఐలు శ్రీధర్, శేషయ్య, మారుతి శంకర్, ఎక్సైజ్ శాఖ ఏఈఎస్‌లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐలు చంద్రహాస్, జయరామ్ నాయుడు, రాజేంద్ర ప్రసాద్, కిషోర్, ఈగల్ టీమ్ ఎస్సై రమేశ్ నాయక్‌తో పాటు ఈగల్ టీమ్ సిబ్బంది, సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

### చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి: రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్



కర్నూలు, సెప్టెంబర్ 13: (మహి న్యూస్): జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కర్నూలు పోలీసులు రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో బాధ్యతాయుతంగా మెలగాలని పోలీసులు సూచించారు. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం సాగించాలని స్పష్టం చేశారు. ఇకపై చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తేలితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.



## సెప్టెంబర్ 14న ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌కు విరామం



నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 13:- వినాయక చవితి పండుగ సందర్భంగా సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం ప్రభుత్వ సెలవు దినంగా ఉన్నందున నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడవని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అర్జీలు సమర్పించేందుకు సెప్టెంబర్ 14న కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 13:- వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రాష్ట్ర రోడ్లు-భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సైతం జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రతి ఇల్లు సుఖసంతోషాలు, సౌభాగ్యాలతో కళకళలాడాలని, ప్రజల జీవితాల్లోని విఘ్నాలన్నీ తొలగిపోయి ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఆనందంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలు మరింత ఫలవంతం కావాలని వారు ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను వినియోగిస్తూ పండుగను పర్యావరణహితంగా నిర్వహించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# సోదరభావంతో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి

### పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
### సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దు.. షేర్ చేయొద్దు: ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, సెప్టెంబర్ 13: (మహి న్యూస్): సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సోదరభావం, మత సామరస్యంతో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని వినాయక మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను



తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇతరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విగ్రహాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు రాత్రి వేళల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనల మేరకే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని మండపాల నిర్వాహకులకు ఎస్పీ సూచించారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, మత పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

### వదంతులను నమ్మొద్దు

సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే అసత్య ప్రచారాలు, వదంతులను ప్రజలు నమ్మవద్దని ఎస్పీ సూచించారు. వాటిని ఇతరులకు షేర్ చేయకుండా, సమాచారం నిజమో కాదో నిర్ధారించుకునేందుకు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు లేదా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసులకు, డయల్-112 లేదా డయల్-100కు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దాం

## 3,000 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబరు 13 :- పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నంద్యాల జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా జిల్లాలో 3,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనం సమీపంలో ఉన్న రెవెన్యూ క్లినిక్ వద్ద ప్రజలకు జిల్లా కలెక్టర్ స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ), రసాయన రంగులతో తయారు చేసే వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించి మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని ఆమె పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా నీటి వనరులను వినియోగించాల్సిన అవసరం లేకుండా, ఇంటివద్దే ఒక పూలకుండీలో నిమజ్జనం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం అదే కుండీలో ఒక మొక్కను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆమె కోరారు.

### గణేష్ మండపాల నిర్వాహకులు భద్రతా నిబంధనలు పాటించాలి

జిల్లాలో గణేష్ మండపాల నిర్వాహకులు సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీలు జారీ చేసే సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ లైన్ల విషయంలో ప్రత్యేక అప్రమత్తత వహించాలని, విద్యుత్ తీగలను కర్రలతో నెట్టడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఏదైనా చిన్న సమస్య ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ

కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి చేపడుతున్న చర్యలకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, సాధ్యమైనంత వరకు ఇంటివద్దే మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, మెంబర్ సెక్రటరీల సూచనలు, ఆదేశాల మేరకు మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు

# కాకినాడ సమగ్ర అభివృద్ధికి భారీ ప్రాజెక్టులు..

కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 13: కాకినాడ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు భారీ ప్రాజెక్టులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక అభివృద్ధి, ప్రాజెక్టుల పైనిర్వహించినసమావేశానికి రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ .హరేంధిర ప్రసాద్,కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు,పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు .

### ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ..

కాకినాడ పట్టణంలో తాగునీరు,రహదారులు, పారిశుధ్యం,గ్రీనరీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి కీలక రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని మంత్రి తెలిపారు.కాకినాడలో రూ.354 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని, నీటి కేటాయింపులకు సంబంధించిన జీవో త్వరలో వెలువడనున్నందున పనులను మరింత వేగవంతం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా పరిసర మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి సేకరించే ఘన వ్యర్థాలను శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన నీటి సరఫరా సమస్యను కూడా త్వరగా పరిష్కరిస్తా మన్నారు. నగర పారిశుధ్యాన్ని




మెరుగుపరిచేందుకు ఎండ్ టు ఎండ్ రోడ్లుఅవసరమని పేర్కొన్న మంత్రి,రహదారుల అభివృద్ధికి రూ.39 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బ్యాలెన్స్ రోడ్లతో పాటు కచ్చా, గ్రావెల్ రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో సెంట్రల్ డివైడర్లు ఏర్పాటు చేస్తామన్నారు. స్వీపింగ్ యంత్రాలు సమర్థంగా పనిచేసేందు కురహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఏరియాను 50 శాతానికి పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా కాకినాడలో పార్కులు, గ్రీనరీ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని,త్వరలో ఖరారు చేసి ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగర పారిశుధ్య సమస్యల కు శాశ్వత పరిష్కారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థే నని మంత్రి స్పష్టం చేశారు. ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు బహి రంగ డ్రైన్లలోకి చేరకుండా భూగర్భ పైపుల ద్వారా తరలించేలా యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కాకినాడలో యూజీడీ ప్రాజెక్టు కు రూ.200--250 కోట్ల వరకు నిధులు సమ కూర్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని, యూఐడీఎఫ్-3, యూఐడీఎఫ్-4 తదితర పథకాల ద్వారా నిధుల సమీకరణకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కన్సల్టెంట్‌ను నియమించి ప్రాజెక్టును త్వరగా ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

### అభివృద్ధి పనులకు ప్రాధాన్యం:

సిటీఎమ్మెల్యేవనమాడి కొండబాబు మాట్లాడుతూ.. కాకినాడ నగరంలో ఇప్పటికే మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పెండింగ్ ప్రతిపాదనలు, భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా సమీక్షిస్తున్నామన్నారు. పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగు పరచడం తో పాటు అవసరమైన చోట్ల రహదారుల నిర్మాణం, డ్రైనేజీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలనిఅధికారులకు సూచించినట్లు చెప్పారు. నగరంలో మురుగునీరు శుద్ధి చేయకుండా సముద్రం లోకి చేరకుండా ఎస్టీపీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతం లో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన పనులతో పాటు ఇంకా పూర్తి చేయాల్సిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు,ఎస్ఈ పి.వెంకటరావు,హెల్త్ ఆఫీసర్ డా. పృధ్వి చరణ్, ఈఈలు మాచిరాజు, కనకారావు, మెప్మా పీడీ శైలజ, టౌన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

### - కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబర్ 13: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గణపయ్య ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు చేకూరాలని కోరారు. ఆ భరోసాతో సమాజం, రాష్ట్రం, దేశ అభివృద్ధి వైపు మనమంతా బలమైన అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని కేంద్ర మంత్రి కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించి పర్యావరణ హితమైన వస్తువులతో పండుగను నిర్వహించాలని సూచించారు. వినాయక చవితి వేడుకల్లో అనవసర ఆర్భాటాలకు, అధిక శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలని కోరారు. డీజే సౌండ్లకు బదులుగా భక్తిభావంతో, ప్రశాంతమైన వాతావరణంలో గణనాథుడిని పూజించుకోవాలని సూచించారు. భక్తి, సంప్రదాయం, పర్యావరణ పరిరక్షణ.. ఈ మూడింటినీ కలిపి వినాయక చవితిని ఆదర్శవంతంగా జరుపుకుందామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు.

## మట్టి గణపతి - గట్టి గణపతి



కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 13: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో కాకినాడ ఎం.ఎస్.ఎన్. చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లడి కార్తిక్ నాయకర్, కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మట్టి గణపతి -- గట్టి గణపతి అనే నినాదం కేవలం ఒక కార్యక్రమానికి పరిమితం కాకుండా, ప్రతి కుటుంబం పర్యావరణ హితమైన వినాయక చవితిని జరుపుకోవాలనే బలమైన సందేశంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమై, జలచరాలు మరియు పర్యావరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడం, సహజ రంగులను వినియోగించడం, ప్లాస్టిక్ అలంకరణలను నివారించడం ద్వారా పండుగను భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రతీకగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్ చారిటీస్ సూపరింటెండెంట్ జే సోమరాజు, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి కంటి వైద్య శిబిరం

### కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు : ఎస్పీ వరదరాజన్.



యానాం,మహి న్యూస్, సెప్టెంబర్ 13: కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజల కంటి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యానాం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో మ్యాక్సీవిజన్ కంటి వైద్యశాల సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని, కంటి చూపు వారికి అత్యంత కీలకమని ఎస్పీ వరదరాజన్ పేర్కొన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మనిషి జీవితంలో కంటి చూపు ఎంతో ముఖ్యమైనదని, కళ్లకు సంబంధించిన సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని అన్నారు. కంటి చూపులో స్వల్ప మార్పులు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా విధి నిర్వహణలో ఎక్కువ సమయం కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించే వారు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శిబిరంలో మ్యాక్సీవిజన్ కంటి వైద్య నిపుణులు పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు, కంటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన వారికి వైద్యపరమైన సూచనలు, సలహాలు అందించారు. కంటి సమస్యలు ఉన్నవారు తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స తీసుకోవాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా సిబ్బంది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్‌బాబు, ఎస్సైలు కుమార్, పట్టాభి, నానాజీ, ట్రాఫిక్ ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,KURNOOL DIST, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## కడప రిమ్స్ మానసిక వైద్యశాలలో పేషెంట్ లక్ష్మి ఆరోగ్యం మెరుగు.. తమిళనాడు నుండి వచ్చి తల్లిని అక్కున చేర్చుకున్న కుమారుడు




కడప మహి న్యూస్ , సెప్టెంబర్ 13: కడప రిమ్స్ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మి అనే పేషెంట్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. రోడ్డు పక్కన మానసిక అనారోగ్యంతో ఉన్న లక్ష్మిని రిస్క్ టీం వారు తమ అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్ మానసిక వైద్యశాలలో చేర్పించారు. అక్కడ వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి ఆమె ఆరోగ్యాన్ని మెరుగుపరిచారు. మానసిక ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత లక్ష్మి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే తమిళనాడు నుండి ఆమె ఇద్దరు కుమారులు కడప రిమ్స్ కు చేరుకున్నారు. తల్లిని చూడగానే ఉద్వేగానికి గురైన కుమారులు తల్లిని అక్కున చేర్చుకున్నారు. ఆ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. అనంతరం ఆసుపత్రి వర్గాలు పేషెంట్ లక్ష్మిని కుమారులకు, కుటుంబ సభ్యులకు అధికారికంగా అప్పగించారు. పేషెంట్ బాధ్యతను తాము తీసుకుంటామని తిరువల్లూర్ నుండి వచ్చిన వెంకటేష్ కుమారులు లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మనోబంధు ఫౌండేషన్ వారికి, రిమ్స్ మానసిక వైద్యశాల వైద్యులకు, సిబ్బందికి చేతులెత్తి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.




## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి..!!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 13: శ్రీ గణనాథుని ఆశీస్సులతో జిల్లా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, సంప్రదాయం, ఆత్మీయతలతో వినాయక చవితి వేడుకలను ఆనందంగా నిర్వహించుకోవాలని, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పొరుగువారితో కలిసి సోదరభావంతో పండుగ జరుపుకోవాలని కోరారు. పండుగ వేళ ప్రజల భద్రత, ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, శబ్ద కాలుష్యానికి దూరంగా ఉంటూ చిన్నారులు, వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారి పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోరారు. నీటి వనరులు కలుషితం కాకుండా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను నివారించాలని సూచించారు. మన భక్తి ప్రకృతికి భారం కాకుండా, భవిష్యత్ తరాలకు మేలు చేసేలా ఉత్సవాలను నిర్వహించడమే నిజమైన పండుగ స్ఫూర్తి అన్నారు. గణనాథుని కృపతో జిల్లాలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సిరిసంపదలు, ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం నెలకొనాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రజల ఐక్యత, భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన సహకారంతో వైఎస్ఆర్ కడప జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## కొత్తపల్లిలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభం

### పెద్దముడియం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/పెద్దముడియం, మహి న్యూస్ సెప్టెంబర్ 13 : పెద్దముడియం మండలంలోని ఉలవపల్లె, కొత్తపల్లి గ్రామాల్లో జమ్మలమడుగు శాసనసభ్యుడు ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో మాట్లాడి పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో సుమారు రూ. 8.50 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను ఇరువురు కలిసి ప్రారంభించారు. పాఠశాల భద్రత, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడంలో ప్రహరీ గోడ ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు జయసింహారెడ్డి, డీకే కొండారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టీడీపీలోకి 100 కుటుంబాలు

### ఉలవపల్లె, కొత్తపల్లె గ్రామాల నుంచి పార్టీలో చేరికలు..

### అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమన్న భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/పెద్దముడియం, మహి న్యూస్ సెప్టెంబర్ 13: పెద్దముడియం మండలం ఉలవపల్లె గ్రామానికి చెందిన ఈదుల రామసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉలవపల్లె, కొత్తపల్లె గ్రామాలకు చెందిన సుమారు 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పెద్ద సంఖ్యలో కుటుంబాలు తెలుగుదేశం పార్టీ కుటుంబంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని భూపేష్ సుబ్బరామిరెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



### పార్టీలో చేరిన వారిలో..

కళావతి (మాజీ సర్పంచ్), పద్మావతి, స్వర్ణలత, నరసింహారెడ్డి, బీరం కొండారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, దానం, సంపత్, సుధాకర్, పుల్లారెడ్డి, దేవదాసు, పవన్, సునీల్, చెన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, గంగుల నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చిన్నబి, దివాకర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం..!

### ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 13: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పి ఓ పి) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ




కార్యాలయ పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని కోటి రెడ్డి సర్కిల్ సమీపంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి ప్రాంతీయ కార్యాలయం, కడప పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి, పర్యావరణహిత వినాయక చవితి వేడుకలపై అవగాహన కల్పించారు.

### "మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం."

ఈ సందర్భంగా పర్యావరణ ఇంజనీర్ శ్రీమతి సుధా కురుబా మాట్లాడుతూ, సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మరియు రసాయనిక రంగుల వినియోగం వల్ల నిమజ్జనం అనంతరం జలవనరులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా




ప్రజలు పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, రసాయనిక రంగులతో కూడిన విగ్రహాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. మట్టి విగ్రహాలను పూజించి, సహజసిద్ధమైన పద్ధతుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పండుగల సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె తెలిపారు. "మన పండుగ -- మన బాధ్యత, మట్టి వినాయకుడు -- పర్యావరణానికి మేలు" అనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప సిబ్బంది, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాకు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్

### ఒక్క రోజులో 92,091 కేసుల పరిష్కారం.. రూ. 22.11 కోట్లకు పైగా పరిహారం చెల్లింపు

కడప, మహి న్యూస్ । సెప్టెంబర్ 13: జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో వైఎస్సార్ కడప జిల్లా రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. సెప్టెంబర్ 12న జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 29 ధర్మాసనాల ద్వారా 92,091 కేసులను పరిష్కరించారు. పరిష్కరించిన కేసుల్లో 91,236 క్రిమినల్ కేసులు, 201 సివిల్ కేసులు, 654 ముందస్తు వ్యాజ్య కేసులు ఉన్నాయి. ఈ కేసుల పరిష్కారంలో భాగంగా మొత్తం రూ. 22,11,42,448 కక్షిదారులకు చెల్లించారు.

ప్రాంతాల వారీగా పరిష్కరించిన కేసులు

కడప - 6,788




ప్రొద్దుటూరు, మైదుకూరు - 13,627
రాజంపేట - 6,622
రాయచోటి - 3,483
బద్వేల్ - 5,989
జమ్మలమడుగు - 13,164
సిద్ధవటం - 3,714
రైల్వేకోడూరు - 6,074
పులివెందుల - 9,292
నందలూరు - 6,040
లక్కిరెడ్డిపల్లి - 11,240
కమలాపురం - 6,058

జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించి, పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయమూర్తులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, న్యాయవాదులు, పోలీసు అధికారులు, ఇతర అధికారులు, కక్షిదారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్, అలాగే సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

## వెలిగల్లు ప్రాజెక్టు నీటిలో వినాయకుడిని నిమజ్జనం నిషేధం

### పర్యావరణ పరిరక్షణ,నీటి కాలుష్యం నివారణ కు అధికారులు సూచన.



గాలివీడు: సెప్టెంబర్13 (మహి న్యూస్ ): వినాయక చవితి సందర్భంగా వెలిగల్లు ప్రాజెక్టు రిజర్వాయర్లో వినాయక విగ్రహాల నిమజ్జనం చేయడాన్ని అధికారులను నిషేధించినట్లు ప్రాజెక్ట్ ఏఈ తెలిపారు. ప్రాజెక్ట్ నీరు ప్రజల అవసరాలకు వినియోగిస్తున్న నేపథ్యంలో నీటి కాలుష్యం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విగ్రహాల తయారీలో ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రసాయన రంగులు పూజా సామాగ్రి నీటిలో కలవడం వల్ల నీటి నాణ్యత దెబ్బ తినే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రజల్లో నిబంధనలను పాటిస్తూ నిర్దేశించిన ప్రదేశాల్లోనే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు వెలిగల్లు ప్రాజెక్టు నీటిలో నిమజ్జనం చేయకుండా భక్తులు సహకరించాలని అధికారులు కోరారు నిషేధిత ప్రాంతంలో విగ్రహ నిమజ్జనం చేస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుని అవకాశం ఉందని హెచ్చరించారు పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రాజెక్టు నీటి స్వచ్ఛతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## ఎర్రబల్లె కొత్తపల్లిలో స్థల వివాదం

### ఇరు వర్గాల మధ్య ఘర్షణ, నలుగురికి తీవ్ర గాయాలు



కమలాపురం మహి న్యూస్ సెప్టెంబర్ 13.: కమలాపురం మండలం ఎర్రబల్లె కొత్తపల్లి గ్రామంలో స్థల వివాదం ఘర్షణకు దారి తీసింది. తమకు కేటాయించిన స్థలంలో బాత్రూం నిర్మాణం చేపట్టడమే వివాదానికి కారణమని తెలుస్తోంది. ఈ క్రమంలో తమ స్థలాల వద్దకు వచ్చి దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో జయరాజు, బాల నరసింహులు, ఓబులేసు, అజయ్ అనే నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కడప రిమ్స్ కు తరలించారు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అవతలి వర్గంలో కూడా ముగ్గురికి గాయాలైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పరిస్థితి అదుపులో ఉన్నట్లు సమాచారం.

## నేడు (14న) పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉండవు..!

### జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 13: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈనెల 14న సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో జిల్లా వ్యాప్తంగా పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడవని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాలతో పాటు జిల్లా కలెక్టరేట్‌లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉండవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు.

## జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు



మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబరు 13: ఈ నెల 14న సోమవారం "వినాయక చవితి" పర్వదినం సందర్భంగా... సర్వ విఘ్నాలను తొలగించి.. సకల శుభాలను ప్రసాదించే ఆ మహా గణపతి... జిల్లా ప్రజలందరికీ పరిపూర్ణమైన ఆయుఃరారోగ్యాలను, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని... ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు జిల్లాపై ఎల్లవేళలా ఉండాలని.. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా ప్రజలకు హృదయ పూర్వకంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరికి అత్యంత ఇష్టమైన భక్తి పూర్వకమైన పండుగ. ఆ మహాగణాధిపతి ప్రతి ఒక్కరి విఘ్నాలను తొలగించి సంతోషాన్ని, ఆనందాన్ని అందించాలని.. జిల్లా ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంటా సంక్షేమం.. సౌభాగ్యం వెల్లివిరియాలి



రాయచోటి, మహి న్యూస్, సెప్టెంబర్ 13: ఈ నెల 14న నిర్వహించుకోనున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇల్లు సంక్షేమం, సౌభాగ్యం, సంతోషాలతో శోభాయమానంగా వెలుగొందాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. అన్నమయ్య జిల్లాలోని పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, వ్యాపారులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంతృప్తికర స్థాయిలో అందేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అన్నమయ్య జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు.

## అదనపు పొగాకు కొనుగోళ్ల అనుమతి కోసం ప్రయత్నిస్తా..

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్.



ఏలూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 13: పొగాకు రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నానన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన పొగాకు రైతులు, రైతు సంఘాల నేతలు ఆదివారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఏలూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు మార్కెట్ గత నాలుగు నెలలుగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని, ప్రస్తుతం మార్కెట్ ధరలు రోజురోజుకూ మెరుగుపడి ఇప్పుడు యార్డులో పొగాకు ధర కేజీ 345 వరకూ చేరిందని చెబుతూ, ఇందు కోసం ఎంపీ గారు చేసిన కృషిని రైతులు ప్రశంసించారు. కొద్ది రోజుల్లో పొగాకు ధర మరికొంత పెరుగుతుందన్న ఎంపీ, దీనికోసం పొగాకు బోర్డుతో, కంపెనీల ప్రతినిధులతో తాను మాట్లాడుతున్నానని తెలిపారు. అయితే రైతులు కూడా బోర్డు అనుమతి లేకుండా పొగాకు సాగు చేయవద్దని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

### అదనంగా పండిన పొగాకు అమ్మకాలకు అనుమతి:

పొగాకు బోర్డు నిర్దేశించిన కోటాకు మించి పండిన పంటను కూడా వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతి కల్పించేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులతో చర్చించి తగిన అనుమతులు ఇప్పించవలసిందిగా రైతులు ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పొగాకు అమ్మకాలు ప్రారంభమై సుమారు ఐదు నెలలు కావస్తోందనీ, తొలినాళ్లలో పొగాకు విక్రయించిన రైతుల కోటాలు ఇప్పటికే పూర్తయ్యాయనీ, అదనపు కోటాల కోసం అనేకమంది రైతులు ఎదురుచూస్తున్నారని రైతులు ఎంపీ కి విన్నవించారు. దీనిపై తప్పకుండా తాను పొగాకు బోర్డుతో, కేంద్ర మంత్రితో మాట్లాడుతానని ఎంపీ హామీ ఇచ్చారు.

### డాప్, యూరియా ప్రత్యేక కోటా:

2026-27 పంట కాలానికి అవసరమైన డాప్ మరియు యూరియా లభించక పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులకు ఈ సందర్భంగా రైతులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పొగాకు రైతులకు ప్రత్యేక కోటా ద్వారా డాప్, యూరియా అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవలసిందిగా రైతులు ఎంపీని కోరారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖా మాత్యులు కింజరపు అచ్చెన్నాయుడు తో మాట్లాడతానని హామీ ఇచ్చిన ఎంపీ, రైతులు కూడా మంత్రిని కలిసి సమస్యను వివరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పొగాకు రైతుల సమస్యలపై స్పందిస్తూ రైతు ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఈ సందర్భంగా రైతాంగం తరపున పొగాకు రైతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఎంపీ ను కలిసిన వారిలో పలువురు పొగాకు రైతులతోపాటు రైతు సంఘాల ప్రతినిధులు వెంట్రప్రగడ శ్రీనివాస్, రవి వర్మ, దుగ్గిరాల బోసు తదితరులు ఉన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com